విశాలాంధ్ర కృష్ణా జిల్లా

అభివృద్ధికి మూలం కమ్యూనిస్టులే..

విశాలాంధ్ర-పమిడిముక్కల: ప్రజల శ్రేయస్సు కోసం కమ్యూనిస్టులు ఉద్యమాలు చేసి వారి కుటుంబాలను కూడా వదులుకున్న ఘటనలు ఉన్నాయని జీసస్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ గద్దె తారాలీల అన్నారు. మామిళ్ళపల్లిలో శనివారం కామ్రేడ్ ద్రోణవల్లి సత్యప్రసాద్ 71వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేసిన మహనీయులు సత్యప్రసాద్‌ని ఈ తరంలో ప్రాంతీయ పార్టీలు వచ్చి ప్రజలను పక్కదారి పట్టించాయని అన్నారు. ఈ ప్రాంతంలో ప్రజల సమస్యలు పరిష్కారానికి బలంగా కమ్యూనిస్టు నాయకులు కృషిచేసేవారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ గద్దె వెంకట కృష్ణారావు మరచి పోకుండా చేసేవారిని గుర్తు చేశారు. ద్రోణవల్లి అనసూయమ్మ, సత్యప్రసాద్ దంపతులు చివరి వరకు కమ్యూనిస్టు భావాలతో ఉండేవారని వారి కుమారుడు భరద్వాజ్ సదరు కార్యక్రమంపై శ్రద్ధతో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిస్టు నాయకులు గొట్టిపాటి నాగేశ్వరరావు, గొట్టిపాటి సత్యప్రసాద్, దండమూడి సత్యప్రసాద్, మధుసూదనరావు, సీపీఐ పామర్రు నియోజకవర్గ కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసరావు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు చర్యలు : విజయభారతి

విశాలాంధ్ర-పెదపారుపూడి : నులిపురుగులను నివారణకు చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీఎంహెచ్ఓ జి.విజయభారతి శనివారం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం ఈనెల 10వ తేదీన జరగనున్నందున సమావేశం ఎంపీడీవో టీ. సీతామహాలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నులిపురుగులు నివారణ గోడపత్రికలను విడుదల చేశారు. ఈ విషయమై ఎంపీపీ గోగం సురేష్ మాట్లాడుతూ మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు 37 పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఆల్బెండిజం టాబ్లెట్లను అందించాలని ఆయన వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి. శ్రీనివాస్, పెదపారుపూడి పి హెచ్ సి వైద్యులు డాక్టర్ శారద, యలమర్రు పి హెచ్ సి వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, వెంట్రప్రగడ పి హెచ్ సి వైద్యులు డాక్టర్ సందీప్, వైద్య సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా భీమ నది చానల్

విశాలాంధ్ర-కూచిపూడి : వీరంకి సెక్షన్లోని భీమ నది, నిడుమోలు సెక్షన్లోని మేనేజర్ మెయిన్, లెఫ్ట్, రైట్ వంటకాలువలు సాగునీటితో ఉధృతంగా నిండుకుండలాప్రవహిస్తున్నాయి. శనివారం కురిసిన వర్షంతో నీటిమట్టం మరింత పెరిగింది. ఇప్పుడిప్పుడే పొలాల్లో నీరు తగ్గుతోందనుకుంటున్న తరుణంలో కురిసిన వర్షం రైతులను ఇబ్బందులు పాలు చేసింది. పగలంతా విపరీతమైన ఎండవేసి సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది.

కాల్వపూడిక పనులు

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ రూరల్ మండల పరిధిలోని మల్లాయపాలెంలో టిడిపి నాయకులు వెనిగండ్ల రాము వితరణతో పంట కాల్వ పూడిక తీత పనులు ప్రారంభించారు. వెనిగండ్ల మాట్లాడుతూ నాలుగేళ్ళుగా మల్లాయపాలెం కాలువలు పూడిక తీయక పోవటంతో రైతుల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు, ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకటరావు, రైతులు లింగం చిట్టిబాబు, అందుగుల ఏసుపాదం, సర్దార్ బ్యాగ్, షేక్ నూర్‌అహ్మద్, మహమ్మద్ వలి, అబ్దుల్ ఖాదర్, జానీభాష, హన్ను, అబ్దుల్ అజీమ్, బాబూలా, ఎండి నజీర్, అబ్దుల్ కయుం, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

విశాలాంధ్ర-అవనిగడ్డ : మండలీపురంలో తరచుగా పైప్‌లైన్ లీక్ శీర్షికన శనివారం కథనం వెలువడటంతో పంచాయతీ అధికారులు స్పందించారు. పంచాయతీ సిబ్బంది మండలీపురంలో పైప్ లీక్ అయిన ప్రదేశానికి చేరుకుని మరమతులు త్వరితగతిన పూర్తి చేసి మండలీపురం ప్రాంత వాసులకు తాగునీటిని సరఫరా చేశారు. దీంతో గ్రామంలోని సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులకు తెలియచేస్తూ పరిష్కారానికి కృషి చేస్తున్న పత్రికకు అభినందనలు తెలిపారు.

చంద్రబాబుపై దాడి హేయం

విశాలాంధ్ర-పెడన : పుంగనూరులో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పై వైసిపి మూకల దాడి హేయమైన చర్య అని రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు అన్నారు. శనివారం బస్టాండ్ వద్ద తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సభలకు ప్రజల నుండి లభిస్తున్న ఆదరణకు వైసీపీకి వణుకు పుడుతుందని అన్నారు. రాష్ట్రంలో వైసిపి పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతుందని వేణుగోపాలరావు అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ హన్ను, పట్టణ అధ్యక్షుడు యక్కల. శ్యామలయ్య, ప్రధాన కార్యదర్శి వాహెబ్ ఖాన్, పార్టీ నాయకులు బెజవాడ నాగరాజు, సేనాపతి అజయ్ కుమార్, పరసా. జితేంద్ర, హమీదుల్ల,దాదా,తమ్మా. భీమయ్య, వాసా. సాంబశివరావు, వెలికట్ల ప్రసాద్, అనుముల పూర్ణచంద్రరావు, కోరుమిల్లి వెంకటస్వామి, కుర్షిత్ బేగం, వేములవాడ జనార్ధన్, అయుబ్ కాన్, తదితరులు పాల్గొన్నారు.

ఉపయోగంలో లేని బంగారం బాంక్‌కు అప్పంగిత

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానానికి ఉపయోగంలో లేని బంగారు ఆభరణాలను గోల్డ్ మానిటైజేషన్ స్కీంలో ఇన్వెస్ట్‌కు 7 కేజీల, 700 గ్రాముల బంగారు ఆభరణాలను ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎం.వి.సురేష్ బాబు, జువెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ దుర్గ భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ ఇంజనం చెన్నకేశవరావు సమక్షంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.రమేష్‌నాయుడు, ఎస్‌బిఐ, మెయిన్ బ్రాంచ్, విజయవాడకి శనివారం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఇఓలు తిరుమలేశ్వరరావు, ఉమాపతి, సూపర్ డెంట్ సునీత, ఆలయ ప్రధాన అర్చకులు మర్రి బోయిన వెంకటరమణ, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

థమ్స్ అప్ 'తూఫాన్ ఉఠావో, ప్రపంచ కప్ జావో' ప్రచారం ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కోకా-కోలా కంపెనీకి చెందిన భారతదేశపు స్వదేశీ పానీయాల బ్రాండ్ థమ్స్ అప్, ఐసీసీ అధికారిక పానీయ భాగస్వామిగా తన తాజా ప్రచారం 'తూఫాన్ ఉఠావో, ప్రపంచ కప్ జావో' తో క్రికెట్ ప్రేమికుల అభిరుచిని రేకెత్తించడానికి సిద్ధంగా ఉంది. ఐసీసీ పురుషుల క్రికెట్ ప్రపంచ కప్ 2023 కోసం ఎదురుచూపులు భారతదేశంలో కొత్త ఎత్తుకు చేరుకున్నందున, థమ్స్ అప్ వినూత్న ప్రచార కార్యక్రమం ఈ సంవత్సరం ఐసీసీ క్రికెట్ ప్రపంచ కప్‌ను ఏ జట్టు గెలుస్తుందో అని భావించే ప్రతి క్రికెట్ అభిమాని అంతర్గత గందరగోళాన్ని పరిష్కరించడం లక్ష్యంగా పెట్టుకుంది.

రైతుల ధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర-మచిలీపట్నం : సాగు చేస్తున్న రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున సాగు సాయం అందజేయాలని ఈ నెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు విజయవాడ ధర్నా చౌక్‌లో రైతు సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సీపీఐ మచిలీపట్నం నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో శనివారం గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు మాట్లాడుతూ రైతులకు స్వామినాథ్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరహాలో రైతు, కౌలు రైతులకు ఎకరానికి రూ.10 వేలు సాగుసాయం అందించాలని, గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి కోరారు. రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని, 50 సంవత్సరాలు నిండిన రైతులకు రూ.5వేలు పింఛన్ అందజేయాలని, పెరుగుతున్న ఉత్పత్తి ఖర్చులు దృష్టిలో పెట్టుకుని, విత్తనాలు, ఎరువులు పురుగు మందులు ఉపకరణాలపై 90 శాతంతో సబ్సిడీ ఇవ్వాలని, వ్యవసాయ విద్యుత్ మీటర్ల ఉపసంహరించుకోవాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్, నియోజకవర్గ కోశాధికారి యర్రంశెట్టి ఈశ్వరరావు, ఏఐటీయూసీ పట్టణ ఉపాధ్యక్షులు వంటిపులి లక్ష్మణరావు, భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు తురక లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ.10 వేలు సాగుసాయం చేయాలి

విశాలాంధ్ర-గూడూరు: రైతులు తీసుకున్న అప్పులన్నీ మాఫీ చేయాలని, తిరిగి వారికి కొత్త రుణాలు ఇవ్వాలని, రైతులకు సాగు సాయం కింద ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలని సీపీఐ పెడన నియోజకవర్గం కార్యదర్శి ఉమాకాంత్ డిమాండ్ చేశారు. సీపీఐ పెడన నియోజకవర్గం కార్యదర్శి ఆధ్వర్యంలో శనివారం కప్పలదొడ్డి గ్రామంలో ఈ నెల 7వ తేదీన విజయవాడలో రైతుసంఘం ఆధ్వర్యంలో జరిగే ధర్నా జయప్రదం చేయాలని పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉమాకాంత్ మాట్లాడుతూ... ప్రతిరైతుకు పంటల బీమా పంటనష్టపరిహారం అందించాలన్నారు. 50 సంవత్సరాల నుండి ప్రతి రైతుకు, నెలకు రూ.10 వేల పింఛన్ ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. వ్యవసాయపనులకు ఉపాధి పనులు అనుసంధానం చేయాలన్నారు. అనేకమైన డిమాండ్లతో విజయవాడ కేంద్రంలో ఈ నెల 7న ధర్నా చౌక్‌లో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నారని, నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు, కౌలురైతులు తరలివచ్చి మహాదర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బట్ట కోట సుబ్రహ్మణ్యం, నున్న హేమ సుబ్రహ్మణ్యం, ఊటుకూరి చిన్నమ్మాయి లింగం, మెడక మోక్ష నందరావు, బల్ల మల్లికార్జునరావు, ఈశ్వర్‌రావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఏదైనా జరిగితే రాష్ట్రం అగ్నిగుండమే : సత్యనారాయణ

విశాలాంధ్ర-మచిలీపట్నం : టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన లో వైసీపీ అల్లరిమూకల రాళ్ళ దాడిని తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు, మచిలీపట్నం మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, గోపు సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు. శనివారం కానూరులోని ఆయన నివాసంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, జెడ్ ప్లస్ భద్రత ఉన్న ప్రతిపక్ష నేత రాష్ట్రంలో పర్యటించే పరిస్థితి లేదంటే ఈ ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని ఆయన అన్నారు. చంద్రబాబు పర్యటను అడ్డుకునేందుకు అడుగడుగునా ఆటంకాలు సృష్టించి, టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు దాడి చేస్తుంటే పోలీసులు చూసి చూడనట్లు హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. పోలీసుల తీరు వల్లే పుంగనూరులో చంద్రబాబుపై రాళ్ల దాడి జరిగిందని, ప్రజాస్వామ్యానికి పుంగనూరు లో జరిగిన సంఘటన చీకటి రోజనే ఆయన అన్నారు. గతంలో జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర మొత్తం పాదయాత్ర చేసినప్పుడు పూర్తి భద్రత కల్పించింది తెలుగుదేశం ప్రభుత్వం దాన్ని జగన్ మర్చిపోయి ప్రవర్తించడాన్ని ఆయన తప్పుపట్టారు. చంద్రబాబు పర్యటనలకు, లోకేష్ పాదయాత్రకి రాష్ట్ర ప్రజలు బ్రహ్మరథం పట్టటం తో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, వైసీపీ మంత్రులకుఓటమి భయం పట్టుకునే వైసీపీ అరాచకాలకు పాల్పడుతుందని ఆయన అన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబుకు వైసీపీ నేతల ద్వారా ఏదైనా హాని జరిగితే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని పాలకులను ఆయన హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వం పుంగనూరులో జరిగిన సంఘటనను దృష్టిలో పెట్టుకుని ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుకు భద్రత ఇంకా పెంచాలని తెలుగుదేశం పార్టీ తరఫున కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పి.వి ఫణి కుమార్, జి.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

దుష్ట పరిపాలనకు నిదర్శనం : కాగిత

విశాలాంధ్ర-బంటుమిల్లి : చిత్తూరు జిల్లా పుంగనూరులో చంద్రబాబు పర్యటనలో పెద్దిరెడ్డి అనుచరులు, వైసీపీ నాయకులు అడ్డుకోవడంపై పెడన నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ కాగిత కృష్ణప్రసాద్ బంటుమిల్లి అంబేద్కర్ సెంటర్‌లో శనివారం నిరసన చేశారు. అనంతరం టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమవేశంలో కాగిత మాట్లడుతూ ప్రజాస్వామ్యంలో ఎవరు ఎక్కడైనా స్వేచ్ఛగా తిరిగే హక్కు ఉండగా, ఈ వైకాపా ప్రభుత్వం రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేస్తూ సీనియర్ రాజకీయ చరిత్ర కలిగిన నారా చంద్రబాబు నాయుడు పర్యటన అడ్డుకోవడం పిరికిఛందల చర్యగా అభివర్ణించారు. వైసీపీ శ్రేణులు అరాచకానికి పోలీసులు అండగా నిలవడం దారుణం అన్నారు. తెలుగుదేశం శ్రేణులపై వైకాపాశ్రేణుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాగిత తెలిపారు. చంద్రబాబు పర్యటనను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు వైసీపీ నాయకులు చంద్రబాబు పై రాళ్ల దాడి చేసిన వారిపైనే కాకుండా మంత్రి పై కూడా నాన్ బైల్ బుల్ కేసు లు నమోదు చేయాలి అని కాగిత కృష్ణప్రసాద్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కూనపురెడ్డి వీరబాబు, లీగల్ సెల్లోప్రధాన కార్యదర్శి రంగనాథ్, మహిళా అధ్యక్షురాలు దాసరి కరుణాజ్యోతి, వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు ఇల్లూరి లీలా కృష్ణ, తాత రాజా, ఓవైవి చలం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

విశాలాంధ్ర-మచిలీపట్నం : జిల్లాలో పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టి స్వచ్ఛమైన జాబితాను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.రాజాబాబు ఎన్నికల అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్వో ఎం.వెంకటేశ్వర్లు ఎన్నికల అధికారులు, జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఓటర్ల జాబితా సవరణ, నులిపురుగుల నివారణ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళవారం తప్పనిసరిగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితా సవరణ పూర్తి వివరాలు తెలపాలన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే వారి నుండి స్వీకరించి భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యేలా చూడాలన్నారు. ఈ నెల 6,7,8 క్లేయిము ఫారాల పూర్తి సమాచారం కూడా వారికి అందజేయాలన్నారు. ఇందులో భాగంగా అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అవసరమైన అల్బెండజోల్ మాత్రలను సంబంధిత ప్రధానోపాధ్యాయులకు, అంగన్వాడీ కార్యకర్తలకు పంపిణీ చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ ఎంపీడీవోలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్సో ఓటర్ల నమోదు అధికారులు (ఈఆర్వోలు),ఏ ఈ ఆర్ వో లు మునిసిపల్ కమిషనర్లు ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలి

కృష్ణాజిల్లాలో ప్రాధాన్యత భవనాల నిర్మాణాలను పూర్తి చేసేందుకు రోజువారి లక్ష్యాలతో చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో

హౌసింగ్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, హ్యాండ్లూమ్ దే, స్వమిత్వ, వ్యవసాయ అనుబంధ, జగనన్న సురక్ష, జేకేసి, ఆడుదాం ఆంధ్రాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమనికి కలెక్టరేట్ చాంబర్ నుండి జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుతో పాటు జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్వో ఎం.వెంకటేశ్వర్లు అధికారులు హాజరయ్యారు. సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ పి. రాజాబాబు మాట్లాడుతూ, కృష్ణాజిల్లాలో ప్రాధాన్యత భవనాల నిర్మాణాలకు సంబంధించి 378 రైతు భరోసా భవనాల్లో 103 భవనాలు పూర్తి అయ్యాయని తెలిపారు, 268 వైయస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలలో 70 పూర్తి కాబడి మిగిలినవి పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న ప్రాధాన్యత భవనాలను సెప్టెంబర్ లోపల పూర్తి చేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు మాట్లాడుతూ, వాటర్ టెస్టింగ్ కోసం ఐసీడీఎస్,వైద్య శాఖ, ఆర్ డబ్ల్యు ఎస్ సమన్వయంతో శాంపుల్ టెస్ట్ చేయాలన్నారు.ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ ఔట్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టి వారిని గుర్తించాలని జిల్లా విద్యా శాఖ అధికారిని ఆదేశించారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-పెడన : బిడ్డ సంపూర్ణ ఆరోగ్యానికి తల్లి పాలను మించిన శ్రేష్టమైన ఆహారం మరొకటి లేదని పెడన మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి ప్రసాద్ అన్నారు. పెడన మున్సిపల్ పరిధిలో 7వ వార్డు వీరభద్రపురంలోని కర్నోడ్ భవ కళ్యాణ మండపంలో ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు, టిహెచ్ఆర్ కిట్ల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భవతులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి బిడ్డకు ఆరు నెలల నిండే వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని గర్భవతులకు బాలింతలకు పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సముద్ర వేణి, మున్సిపల్ కమిషనర్ బి మహేంద్ర, ఐసిడిఎస్ సూపర్వైజర్ లు సిహెచ్ ప్రసన్న, శ్రావణికుమారి, ఏసిడిపిఓ సుధారాణి, నాల్గవ వార్డ్ కౌన్సిలర్ రహేతున్నిసా, 14వ వార్డ్ కౌన్సిలర్ శ్రీమతి తిప్పా. లక్ష్మీ నరసమ్మ, 20వ వార్డు కౌన్సిలర్ కోసనం. కరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే వ్యాధినిరోధక శక్తి..

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడి రోటరీ క్లబ్ సహకారంతో అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షణలో శనివారం కూచిపూడి రవిప్రకాష్ సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న సంజీవిని వైద్యాలయం వైద్యనిపుణులు డాక్టర్ .టి నీలిమ, మొవ్వ పి.హెచ్.సి. వైద్యురాలు డాక్టర్ పి నిహారిక బాలింతలను గర్భిణీలను ఉద్దేశించి ప్రసంగిస్తూ తల్లిపాలలో 'కొలాస్ట్రమ్'అనే వ్యాధి నిరోధక శక్తి ఎంజైమ్‌ఉండటంతో చంటి పిల్లలనుపలు

వ్యాధుల నుంచి కాపాడుతాయని పేర్కొన్నారు. కూచిపూడి రోటరీక్లబ్ అధ్యక్షుడు కే రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి వీ రవిబాబు, రోటరీ క్లబ్ పి ఆర్ ఓ పాగోలు రమేష్ బాబు, వైద్యాలయం ఏవో జొన్నలగడ్డ హనుమకుమార్, గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఓటర్ల జాబితా సవరణ, ఇంటింటి సర్వేలపై నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని దీనిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం మండల పార్టీ ఆధ్వర్యంలో తహశీల్దార్ ఎల్ శివరామకృష్ణకు శనివారం వినతి పత్రం సమర్పించారు. ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి నియోజకవర్గంలో ఓటర్ల జాబితా సవరణ, 2023వ సంవత్సరం ఇంటింటి సర్వేపై పిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వర రావు, అవనిగడ్డ ఉపసర్పంచ్ ఘంటశాల రాజమోహన్‌రావు (కన్నయ్య) మండల రాంమోహన్‌రావు, గుగ్గిలం శ్యామ్‌ప్రసాద్, యలవర్తి చిన్న, బట్టు పూర్ణ, షేక్ బాబావలి, పులిగడ్డ నాంచారయ్య, పరిమిశెట్టి శేఖర్ పాల్గొన్నారు.

రక్తహీనతను తొలగించుకోవాలి : ఎంపీపీ ఇందిర

విశాలాంధ్ర-కూచిపూడి : గర్భిణీలు, బాలింతలు బలహీనతతో, రక్తహీనతతో ఉండరాదనే తపనతో సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి వైయస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా అందజేస్తున్న బలవర్ధకమైన ఆహారాన్ని సక్రమంగా వినియోగించుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మెలగాలని మొవ్వ మండల పరిషత్ అధ్యక్షురాలు కొండేటి ఇందిర పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ నాలుగు కేంద్రాల కార్యకర్తలు పి బసవపూర్ణ,, కే ప్రమీల రాణి, కే సుజాత, కే అర్జున కుమారి, హెల్పర్లు ఎం ఏడుకొండలు కే అరుణకుమారి, పి నాగమణి, కే సుభాషిణి, గర్భిణీలు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక చేయూత : సర్పంచ్ జ్యోతి

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : అనిగలపాడులో శ్రీ మాతృ మహిళా మండలి మాతృ ఫౌండేషన్ ఖమ్మం ఆధ్వర్యంలో పంచాయతీ కుట్టుమిషన్ ట్రైనింగ్ సర్టిఫికెట్స్ రెండు నెలలు ట్రైనింగ్ ఇచ్చి 20 మందికి శనివారం సర్పంచ్ జ్యోతి బ్రాహ్మం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాతృ మహిళా మండలి అధ్యక్షురాలు ఎస్‌కె రాజీఓ, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు జీతాలివ్వాలి : ఏపీటీఎఫ్

విశాలాంధ్ర-కూచిపూడి : పిల్లలకు పాఠాలు బోధిస్తున్న టీచర్లకు వెంటనే జీతాలు విడు దల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మొవ్వ తాలూకా కార్యాలయం వద్ద ఉపాధ్యా యులు నిరసన ప్రదర్శన చేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, రీఅపోర్షన్ ద్వారా సర్దుబాటు జరిగే ఉపాధ్యాయులకు రెండు నెలల నుండి జీతాలు రావట్లేదని నినాదాలు చేస్తూ వెంటనే జీతాలు సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఈవి రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో 55 వేల మంది ఉపాధ్యాయులు బదిలీలు పదోన్నతులు పొందారని వారికి రెండు నెలలుగా గీతాలు ఇవ్వకపోవడంతో వారు బాధ వర్ణనాతీతం అన్నారు.

మానవత జిల్లా అధ్యక్షుడిగా పొట్లూరి

విశాలాంధ్ర-గుడివాడ : సేవాకు మారుపేరుగా నిలిచిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా 50వేల మంది సభ్యులతో పలు సేవా కార్యక్రమలు నిర్వహిస్తుందని మానవత వ్యవస్థాప అధ్యక్షుడు ఎన్.రామచంద్రరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎన్‌జీవో హాంలో మానవత జిల్లా కార్యవర్గ ప్రమాణస్వీకర కార్యక్రమాన్ని జిల్లా కన్వీనర్ ఎం.కోటేశ్వరరావు అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవస్థపక అధ్యక్షుడు రామచంద్రరెడ్డి మాట్లాడుతూ 2003లో స్థాపించిన మానవత సంస్థ నేడు 50వేల మంది సభ్యులతో పలు సేవా కార్యక్రమలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గుడివాడ శాఖను తమ సంస్థ చైర్మన్ గుత్తా రమేష్ నాయకత్వంలో పలు సేవా, అభివృద్ధి కార్యక్రమలు నిర్వహించి సభ్యుల సంఖ్యను పెంచుకుంటు రావడం అభినందనీయమన్నారు. నూతనంగా ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా పొట్లూరి వీరశేషగిరిరావు, కార్యదర్శిగా శీతాల ప్రసాద్, కోశాధికారిగా పడ్డి రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా వేమూరి బాబురావు, సహాయ కార్యదర్శిగా తలారి గోపాలకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా గంటా కనకారావు, ముదిగొండ నాగవారభద్రశాస్త్రి, గొదావారి సత్యనారాయణ, పిట్టు శ్రీనివాసరావు, ప్రమాణస్వీకరం చేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ శాఖ అధ్యక్షురాలు దండమూడి విజయలక్ష్మి, సభ్యులు, తదితరలు పాల్గొన్నారు.

చంద్రబాబుపై దాడిని ఖండిస్తూ కాగడాల పదర్శన

విశాలాంధ్ర-గుడివాడ : మాజీ సీఎం, ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబునాయుడుపై జరిగిన రాళ్ళ దాడికి నిరసనగా స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌చార్జి రావి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ, రూరల్ అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీలు మాట్లాడుతూ నిన్న పుంగనూరులో పోలీసుల సమక్షంలో అడ్డుకోవడం హేయమైన చర్యన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత నియోజవర్గ అధ్యక్షులు గోవాడ శివా, టిడిపి నాయకలు పొట్లూరి కృష్ణారావు, షేక్ జానీషరీఫ్, మజ్జాడ నాగరాజు, ఐనంపూడి సురేష్, రామదేణు వేణు, షేక్ సర్కార్, తదితరులు పాల్గొన్నారు.

రాయల్ స్టాగ్ బూమ్‌బాక్స్ 'హూడీ' మ్యూజిక్ వీడియో

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వయాకోమ్ 18 సహకార సమన్వయంతో రాయల్ స్టాగ్ బూమ్‌బాక్స్, బాలీవుడ్ యొక్క సుమధుర సంగీతం భారీ తరం ఒరిజినల్ ధ్వనిని సృష్టిస్తూ హిప్ హాప్ యొక్క లోతును పుదృుతూ సంపూర్ణంగా కొత్త సంగీత కళా ప్రక్రియలను తీసుకురావడానికి సర్వం సిద్ధం చేసుకొంది. 'లివింగ్ ఇట్ లార్జ్' స్ఫూర్తిని సంబరంగా జరుపుకుంటూ, రాయల్ స్టాగ్ బూమ్‌బాక్స్ నాలుగు ఒరిజినల్ సంగీత గీతాల ఆవిష్కరణతో తన తర్వాతి దశకు ప్రవేశిస్తోంది. విడుదల చేయబడే అట్టి ఒరిజినల్ సంగీత స్వరగీతిక, బాలీవుడ్ గాయని నికితా గాంధీ, రాపర్ బాలీ డైనమిక్ జంట మధ్య ఒక విశిష్ట సహకార సమన్వయంగా ఉంటుంది. ఈ కొత్త పాట 'హూడీ' బాలీవుడ్, హిప్ హాప్ యొక్క ఒక చమత్కారమైన మిశ్రమంగా, ఇద్దరు కళాకారులతో కూడి ఉన్న ఒక తమాషా మ్యూజిక్ వీడియోగా సంపూర్ణమై ఉంది.

వైసీపీ పాలనలో శాంతి భద్రతలకు ముప్పు : శావల దేవదత్

విశాలాంధ్ర-ఎ కొండూరు : వైసిపి ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుండి శాంతిభద్రతలకు ముప్పు వాటిల్లిందని వైసిపి గుండాలు ప్రజాస్వామ్యం సిగ్గుపడేలా ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని తిరువూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ శావల దేవదత్తు అన్నారు. పుంగనూరులో శుక్రవారం రోడ్‌షో నిర్వహిస్తున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పై తెలుగుదేశంపార్టీ కార్యకర్తల పై వైసిపి గుండాలు రాళ్లదాడి నిరసనగా మండలంలోని చీమలపాడు గ్రామంలో విజయవాడ భద్రాచలం రహదారిపై టిడిపి నాయకులు కార్యకర్తలు నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా శావల దేవతత్తు

మాట్లాడుతూ వైసిపి పాలనలో గుండాలు వ్యవహరిస్తున్న తీరు వల్ల తీరుప్రజాస్వామ్యానికి మచ్చ అని అన్నారు సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీల వారిపై దాడులు చేసి భయభ్రాంతులను చేసి తిరిగి మరళా అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. అనంతరం చీమలపాడులో అయినా మహాశక్తి కార్యక్రమాన్ని టిడిపి నాయకులు మహిళా కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గద్దె కృష్ణారెడ్డి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వనపర్ల డేవిడ్ రాజు మండల పార్టీ ఉపాధ్యక్షుడు బి. పిక్లనాయక్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బెజవాడ శంకర్ మాజీ సర్పంచ్ మోర్ల తిరుపతిరావు తిరువూరు నియోజకవర్గ ఎస్టీ సెల్ నాయకులు బి భీమా నాయక్ జంగా కిషోర్ మేకల రామారావు మహిళా కార్యకర్తలు మంగమ్మ ఉషారాణి సంగీత నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కూలీ రెట్లు పెంచండి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కూలీ రెట్లు పెంచాలని నగర ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు, నగర కార్యదర్శి కొట్టు రమణరావు, ముఠా కార్మిక సంఘం కార్యదర్శి వి.నాగేశ్వరరావు, రాష్ట్ర అమాలిల నాయకులు వెంకట సుబ్బయ్య కోరారు. శనివారం ఏఐటీయూసీ, సీటీయూసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విజయవాడ సామారంగం చౌక్‌లో కూలీ రెట్లు పెంచాలని ధర్నా నిర్వహించారు. ఈనెల 9వతేదీ లోపు కూలీ రెట్లు పెంచకపోతే 10వతేదీ నుండి పని బంద్‌కు పిలుపునిచ్చారు. ముఠా సంఘాల ఆధ్వర్యంలో కూలి రేట్లు పెంచాలని ఈనెల 9వ తేదీన సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు. అధిక ధరలు పెంచుతూ కార్మికుల మీద అదనపు భారం మోపుతున్నారని తెలిపారు. ధరలకు అనుగుణంగా కార్మికుల కూలి రేట్లు కూడా పెంచాలని. డిమాండ్ చేస్తూ. సమస్యలను పరిష్కరించుకోవాలని కార్మికుల కూలి రేట్లు పెంచాలని నాయకులు డిమాండ్ చేశారు.

కార్మికులకు కనీసవేతనం రూ.25 వేలు ఇవ్వాలి

ఘనంగా ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మహాసభలో తీర్మానం

ఎం.సంధ్య

కె.రాణి

విశాలాంధ్ర-విజయవాడ : ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ విజయవాడ నగర మహాసభ స్థానిక దాసరి నాగభూషణం భవనంలో శనివారం ఘనంగా జరిగినది. ఈ మహాసభలో అనేక తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యశాలలో పనిచేయుచున్న కాంట్రాక్ట్ కార్మికులను బేషరతుగా పర్మినెంట్ చేయాలని తక్షణమే కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం 25,000 ఇవ్వాలని ఒక తీర్మానంలో మహాసభ కోరింది. ప్రభుత్వ వైద్యశాల్లో పనిచేస్తున్న స్కావెంజర్స్, స్వీపర్స్ , సెక్యూరిటీ గార్డ్స్. ఎఫ్ ఎన్ ఓ, ఎంఎన్ఓ. ల్యాబ్ టెక్నీషియన్స్. నర్సులు, అటెండర్స్ ఇంకా వివిధ రంగాలలో పనిచేయుచున్న కాంట్రాక్ట్ కార్మికులు అవుట్ సోర్సింగ్ కార్మికులు మన రాష్ట్రంలో సుమారు 14 మందికి పైగా ఉన్నారని తెలిపారు. వెంటనే పర్మినెంట్ చేయాలనిమహాసభలో తీర్మానించారు. సభలో చర్చలు అనంతరం మహాసభ నూతన కమిటీని 29 మందితో ఎన్నుకున్నది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. మట్ట సంధ్య, కే రాణి, ఏసుదయమ్మ, పి లక్ష్మి, బాణావతి లక్ష్మి, ఎం లక్ష్మి ,సత్య సాయి బేబీ, కృష్ణ, కే అరుణ, ఎం దుర్గమ్మ, సీహెచ్ సావిత్రి, సునీత, రమీజా, ప్రమీల, మున్ని, లీల, మరియమ్మ, నాగమణి తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకొన్నారు కమిటీ సభ్యుల నుండి నూతన ఆఫీస్ బేరర్స్ గా గౌరవాధ్యక్షులుగా టీ తాతయ్య, అధ్యక్షులుగా కె. రాణి, ఉపాధ్యక్షులుగా కె.ఆర్ ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా లీలావతి ప్రధాన కార్యదర్శిగా మట్ట సంధ్య, కార్యదర్శిలుగా మున్ని, సీహెచ్ రాధా వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎం. సాంబశివరావు ప్రచార కార్యదర్శులుగా సంతోష్ ప్రచార కార్యదర్శిగా నాగమణి ప్రచార కార్యదర్శిగా మరియమ్మ , కోశాధికారిగా బాణావతి లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. అనంతరం మహాసభ తీర్మానంలో భాగంగా ఈనెల 17వ తేదిన విజయవాడ ధర్నా చౌక్‌లో యూనియన్ విజయవాడ నగర కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు కనీస కనీస వేతనం 25 వేల రూపాయలు ఇవ్వాలని ధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ధర్నాలో విజయవాడ నగరంలోని ప్రభుత్వ వైద్యశాలలో పనిచేయుచున్న కాంట్రాక్ట్ కార్మికులు సెక్యూరిటీ గార్డ్స్ హాజరవు కావాలని కోరారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు స్టేడియంను సిద్ధం చేయండి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంను సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న 76వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమ ఏర్పాట్లపై స్టేడియంలో కలెక్టర్ శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన 76వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని రాష్ట్ర పండుగగా ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. సీఎం, గవర్నర్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు వేడుకల్లో పాల్గొంటారన్నారు. సాధారణ పరిపాలన శాఖ వీఐపీలకు వీవీఐపీలకు ప్రోటోకాల్ ప్రకారం కేటాయించిన గ్యాలరీల వారిగా పాస్‌లను మంజూరు చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అత్యవసర మందులతో ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా ఆ శాఖాధికారులు జనరేటర్లను ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, ట్రాన్స్‌కో, ఫైర్, ఏపీ ఎస్ఆర్టీసీ, మెడికల్ అండ్ హెల్త్, సివిల్ సప్లయి, ఐ అండ్ పీఆర్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల విజయవంతంలో భాగస్వాములు కావాలన్నారు. ఏర్పాట్ల నిర్వహణలో జిల్లా అధికారులకు అప్పగించిన భాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ, సీఎం కార్యక్రమాల సమన్వయ కర్త తలశిల రఘురామ్, డీసీపీ విశాల్ గున్ని, జేసీ డాక్టర్ పీ.సంపత్‌కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో కే.మోహన్‌కుమార్, పాల్గొన్నారు.

మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ఫెడరిక్ ఏంగెల్స్

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ఫ్రెడ్రక్ ఏంగెల్స్‌కు కమ్యూనిస్టు నాయకులునివాళులర్పించారు. ఫ్రెడ్రక్ ఎంగెల్స్ 128వ వర్ధంతి సందర్భంగా శనివారం హనుమాన్ పేట వద్ద కారల్ మార్క్స్ ఎంగెల్స్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ యూరప్‌లో పరిశ్రమలు విస్తరించుతూ, కార్మికవర్గ దోపిడీ విచ్చలవిడిగా సాగుతున్న 18వ శతాబ్దంలో ఒక బట్టల మిల్లు యజమాని కుటుంబంలో ఫ్రెడరిక్ ఏంగెల్స్ 1820 నవంబరు 28న ప్రష్యా (ఇప్పటి జర్మనీ)లోని బార్మెన్ నగరంలో జన్మించారని తెలిపారు. ఒక సామాజిక శాస్త్రవేత్తగా, రచయితగా, తత్వవేత్తగా, బహుభాషా కోవిదుడుగా, విప్లవకారుడిగా ఏంగెల్స్ జీవించాడు. ప్రపంచగతిని మార్చిన సిద్ధాంతమైన మార్క్సిజాన్ని రూపొందించడంలో మహా మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్‌కు మిత్రుడుగా, చేదోడు వాదోడుగా జీవించాడన్నారు. 19వ ఏటనే ఏంగెల్స్ తన మిత్రులకు 15 భాషలలో లేఖలు రాసేవాడు. నిశిత పరిశీలన నేర్చుకున్నాడు. ఉప్పర్‌టాల్ అనే బట్టల మిల్లుల కేంద్ర నగరంలో బాలికలతో పనిచేయిస్తున్న పరిస్థితులను, అక్కడి ప్రజల ముఖ్యంగా కార్మికుల వెతలను పరిశీలించాడు. అక్కడి దీనగాథలు ఏంగెల్స్‌ను కదిలించి వేసాయని పేర్కొన్నారు. ఇంగ్లండు లోని కార్మికుల స్థితిగతుల మీద పరిశీలన సాగించి "ఇంగ్లండులో కార్మికుల పరిస్థితి" అనే గ్రంథాన్ని రచించాడు (మార్క్స్‌తో పరిచయం కావడానికి ముందే రాసిన గ్రంథం). 'పవిత్ర కుటుంబం' పేరుతో కారల్ మార్క్స్‌తో కలసి రచించిన గ్రంథం 1846లో విడుదలైంది. వ్యక్తి ముందా? సమాజం ముందా? అనేదానికి సమాజమే ముందు అని రుజువులతో సహా ఆ గ్రంథంలో బోధించారు. మార్క్స్‌తో కలసి ఏంగెల్స్ సాగిస్తున్న కృషి, వారి తాత్విక దృష్టి, వారి పట్టుదల తెలిసిన కమ్యూనిస్టు లీగ్ 1847లో కమ్యూనిస్టు ప్రణాళికను రాసే పనిని మార్క్స్, ఏంగెల్స్‌లకు అప్పచెప్పగా అందుకోసం ఏంగెల్స్ విడిగా కమ్యూనిజం సూత్రాలు పేరుతో తన అభిప్రాయాలను మార్క్స్‌కు అందించాడు. 1848 ఫిబ్రవరి 21న విడుదల అయిన 'కమ్యూనిస్టు ప్రణాళిక' లో ఏంగెల్స్ ప్రతిపాదనలు చాలా భాగం ఉంటాయన్నారు. ఏంగెల్స్ 1895 ఆగష్టు 5వ తేదీన లండన్‌లో మరణించాడని వీరి ఆశయాల కోసం మనమంతా కృషి చేయాలని, అప్పుడే ఎంగెజ్ కు నిజమైన నివాళులు అర్పించినవారమౌతామన్నారు. నివాళులర్పించిన వారిలో కార్యవర్గ సభ్యులు తోనంవీరయ్య, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య తదితరులున్నారు.

మోడీని గద్దెదింపాలి, దేశాన్ని రక్షించాలి

విశాలాంధ్ర-విజయవాడ : కార్పొరేట్ సంస్థలకు లబ్దిచేకూర్చే విధంగా ఏటా కొత్త కొత్త చట్టాలను అమలు చేస్తూ, కార్మికుల పొట్టగొడుతున్న ప్రధాని నరేంద్ర మోడీని గద్దెదించి దేశాన్ని రక్షించాలని కార్మిక సంఘాల నాయకులు కొత్తపల్లి సుందరరావు, ఎస్వీ భద్రం డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తెచ్చిన లేబర్ కోడ్ ను రద్దు చేయాలని కోరుతూ ఏఐటీయుసీ, సీఐటీయు, కార్మిక సంఘాల అధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక సమావేశం స్థానిక సుందరయ్య భవన్లో శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుందరరావు, భద్రం మాట్లాడుతూ కార్మికుల సంక్షేమ పథకాలలో కోత విధించడం, ఉద్యోగుల జీత భత్యాలను తగ్గించేందుకే కేంద్ర కార్మిక, ఉద్యోగ మంత్రిత్వ శాఖ కొత్త కార్మిక చట్టాలను అమలు చేస్తోందని ఆరోపించారు. ఉద్యోగుల పని దినాలను కుదించడం వల్ల కంపెనీలు నిర్ణయించే వేతనాలపై తీవ్ర ప్రభావం పడుతుందని, ఫలితంగా ఉద్యోగుల వేతనాలు గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యోగుల ఫెన్షన్, పీఎఫ్, రవాణా భత్యం, ఓవర్ టైం, గ్రాట్యుటీ, బోనస్ వంటి ఉద్యోగుల ప్రయోజనాలను సగానికి పైగా తగ్గించేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర పూరితంగా అనుసరిస్తున్న విధానమని విమర్శించారు. దేశ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీలకు దోచిపెట్టాలని ప్రయత్నిస్తున్న బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని కోరారు. మోడీ, అమిత్ షాలు అమలు చేస్తున్న లేబర్ కోడ్ కు వ్యతిరేకంగా ఈ నెల 9న చేపట్టిన నిరసన కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న కార్మిక సంఘాలకు ప్రజలు తమ సంపూర్ణ మద్దతు తెలపాలని, వచ్చే 2024 సార్వత్రిక ఎన్నికల్లో మతోన్మాద బీజేపీకి గట్టిగా బుద్ధి చెప్పాలని సుందరరావు, భద్రం విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి వెంకటేశ్వరావు, ఏ రవి, బి రమేష్, ఏఐటియుసి నాయకులు ఎ ముత్తయ్య, రైతు సంఘం నాయకులు ఎస్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిషత్‌కు సైన్స్ దోహదం

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్: విద్యార్థుల ఉజ్వల భవిషత్ కు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఎంతో దోహదపడుతుందని, విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకుని జిల్లా గర్వించేలా జాతీయ, అంతర్జతీయ శాస్త్ర వేత్తలుగా ఎదిగి నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ డిల్లీరావు విద్యార్థులకు సూచించారు. విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మారెడ్డి సీతారావమ్మ సైన్స్ ల్యాబ్ ము శనివారం జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు ప్రారంభించారు. అలాగే 1994-95 బ్యాచ్ విద్యార్థులు నిర్మించిన సైకిల్ షెడ్ ను డీఈవో సీవీ రేణుక ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మట్లాడుతూ జిల్లాలో 187 ఉన్నత పాఠశాలలు ఉన్నాయని వాటిలో దాదాపు 100 పాఠశాలలో సైన్స్ ప్రయోగశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నున్న పాఠశాలలో అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిఇవో సివి రేణుక, డివైఇవో కె వివిస్ కుమార్, యం ఇవో ఎ వెంకట రత్న, గ్రామ సర్పచ్ కె. సరళ, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు వి. గోపాల రెడ్డి, వ్యవసాయ సలహా కమిటి చైర్మన్ వై నాగి రెడ్డి, పిఎస్ ఇఎస్ చైర్మర్ పి ప్రభాకరరెడ్డి, ల్యాబ్ దాతలు యం పద్మావతి, బి. గోపికృష్ణరెడ్డి, యు. రామిరెడ్డి, జి. సత్యనారాయణ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రామిక గర్జన జయప్రదం చేయండి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈనెల 9వతేదీన శ్రామిక గర్జన పిలుపును జయప్రదం చేయాలని నగర ఏఐటీయూసీ కార్యదర్శి కొట్టు రమణారావు పేర్కొన్నారు. ఈనెల 6వతేదీన ఉదయం 10గంటలకు విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్ వద్ద మానవహారం జరుగుతోందన్నారు. రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు, ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, కార్మికులంతా కలిసికట్టుగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

వీరులపాడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీచేసిన సీపీ

విశాలాంధ్ర-వీరులపాడు: సాధారణ తనిఖీలలో భాగంగా సీపీ కాంతి రాణా టాటా శనివారం వీరులపాడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణ ను పరిశీలించిన అయన సిబ్బంది, రికార్డులు, క్రైమ్ రేట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో డిసిపి వేజెండ్ల అజిత, ఏసీపీ జనార్దన్ నాయుడు, సీఐ నాగేంద్ర కుమార్, ఎస్సై మహాలక్ష్ముడు పాల్గొన్నారు.

'బేసిక్ లైఫ్ సపోర్ట్'లో శిక్షణ

విశాలాంధ్ర విజయవాడ లబ్బీపేట : ఆస్టర్ రమేష్ అమరావతి హాస్పిటల్ ఆధ్వర్యంలో తిరువూరు నాగార్జున జూనియర్ కళాశాల విద్యార్థులకు ఈ రోజు "బేసిక్ లైఫ్ సపోర్ట్ " నందు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఎమర్జెన్సీ మరియు క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్. దినేష్ కుమార్ గుండె పోటు మరియు ఇతర అత్యవసర వ్యాధులు సంభవించినప్పుడు రోగిని హాస్పిటల్‌కు తరలించే ముందు అత్యవసరంగా చేయవలసిన వైద్యపరమైన విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ "మానిక్విన్" పై శిక్షణ ఇచ్చారు. ఇటువంటి శిక్షణ పొందిన వారు అత్యవసర సమయంలో వైద్యం అందుబాటులో లేని వారికి ఫస్ట్ ఎయిడ్ ఇవ్వడం ద్వారా ఎంతో విలువైన ప్రాణాలు కాపాడవచ్చని తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సీనియర్ జనరల్ మేనేజర్ కోనేరు కోటేశ్వరరావు మాట్లడుతూ సామాజిక బాధ్యతగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్. పోతినేని రమేష్ బాబు సంకల్పం మేరకు ఇప్పటి వరకు ఒక లక్షకు పైగా విద్యార్థులు,డాక్టర్లు,పారా మెడికల్ సిబ్బంది, శిక్షణ అవసరం అయిన వారు 9848172652 నంబర్ నందు సంప్రదించవచ్చని తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో నాగార్జున జూనియర్ కాలేజ్ చైర్మన్ హనుమంతరావు, డైరక్టర్లు నర్సింహారావు, సూరిబాబు ప్రిన్సిపాల్ శేషగిరిరావు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న బ్లేడ్ బ్యాచ్

-డబ్బులు ఇవ్వకపోతే బ్లేడ్.కటర్లతో దాడి
-వరుస ఘటనలతో జనం బెంబేలు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): బ్లేడ్ బ్యాచ్ ముఠా మరోసారి రెచ్చిపోయింది. కేవలం రూ.100 కోసం ఓ యువకుడి పై దారుణానికి పాల్పడ్డారు. బెజవాడలో ఇలాంటి ఘటనలు కొత్తేంకాదు. గతంలో చాలానే జరిగాయి. బ్లేడ్ బ్యాచ్ ముఠా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. గంజాయి, మద్యం, మత్తులో కురుకుపోయి ఈ గ్యాంగ్ ఎంతటి దారుణాలకైనా తెగిస్తుంది. ఇదిలా ఉంటే నగరంలో బ్లేడ్ బ్యాచ్ ఆగడాలకు అడ్డు అదుపులేకుండా పోతోంది. మరోసారి రెచ్చిపోయి సినిమాకు వచ్చిన యువకుడి పై బ్లేడ్ బ్యాచ్ దాడి చేసింది. ఈనెల 3వతేదీన దేవినేని గాంధీపురంలోని వైఎస్సార్ పార్క్ వాచ్‌మెన్ సింహాచలం పై బ్లేడ్ బ్యాచ్ దాడి చేసి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్ తీసుకుని పరారైయ్యారు. తాజాగా బీహార్‌కు చెందిన సోను కుమార్(18) జీవన ఉపాధి నగరానికి వచ్చి అమరావతిలో నూడిల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. శనివారం విజయవాడ అప్సర్ థియేటర్‌లో మొదటి షో సినిమా చూసేందుకు వచ్చాడు. సినిమా థియేటర్‌లో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు డబ్బులు డిమాండ్ చేశారు. అందుకు నిరాకరించడంతో ఇక వెంటనే వారి చేతిలో ఉన్న పదునైనా కట్టర్‌తో సోను చేతుల, బుగ్గ మీద కోశారు. తీవ్రగాయాలైన బాధితుడు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇక తాజాగా బ్లేడ్ బ్యాచ్ ముఠా రెచ్చిపోవడంతో స్థానిక ప్రజలు భయందోళనలకు గురవుతున్నారు.

వేడివేడిగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-కంచికచర్ల: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ మలక్ బషీర్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు అధికారులు మాట్లాడుతూ విద్యా ,వ్యవసాయం, పక్కా గృహాలు పై సమీక్ష జరిపారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలల కు దీటుగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసిందని అన్ని సదుపాయాలు అందజేస్తుందని అన్నారు. ఈ విషయమై స్థానిక ఎంపీటీసీ బుర్రె శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు అన్ని సదుపాయాలు కల్పించినప్పుడు టెన్త్ పరీక్షల్లో 40 శాతం తక్కువ మార్కులు రావడానికి అర్థం ఏమిటి అని దీనిలో ఎవరి లోపం ఉందని అన్నారు. నేను ప్రజాస్వామ్యబద్ధంగా ఎంపీటీసీగా ఎంపిక అయినప్పటికీ పాలకులు అధికారులు నా పై చిన్న చూపు చూస్తారని ఏ కార్యక్రమానికి పిలవక పోవడం నన్ను అవమాన పరచటమేనని ఆయన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎంపీపీ మలక్ బషీర్ కు ఆయనకు వాగ్వాదం జరిగింది. నా సిగ్మెంట్లో సిమెంట్ రోడ్డు వేసేటప్పుడు కూడా నాతో ఒక మాట కూడా చెప్పలేదని అవసరం ఉన్న చోట వదిలేసి ఎక్కువ అవసరం లేని చోట రోడ్డు వేశారని అన్నారు. ఈ వాదన తో ఆయన నేలపై కూర్చుని కొంతసేపు నిరసన వ్యక్తం చేశారు. ఏవో మాట్లాడుతూ ఇంటర్ పాస్ అయి ఉన్న యువకులు డ్రోన్ పైలట్ ట్రైనింగ్ తీసుకుంటే 10 లక్షల రూపాయల డ్రోన్ ఇచ్చి దానిలో నాలుగు లక్షల సబ్సిడీ గాను 5 లక్షల రూపాయలు బ్యాంకు లోను గాను లబ్ధిదారుడు లక్ష రూపాయలు తో డ్రోన్ పొందవచ్చని అన్నారు. ఈ విషయంపై గణాత్కూర్ ఎంపీటీసీ వెంపరాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులకు కావాల్సిన ధాన్యం కప్పుకునేందుకు పట్టాలు, ట్రాక్టర్ పనిముట్లు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందజేసే వని వాటన్నింటినీ ఆపేసి కొద్దిమందికి ఉపయోగపడే పది లక్షల రూపాయల డ్రోన్ ఎంతమందికి అవసరం పడుతుందని విమర్శించారు. దీనిపై సభలో కొంతసేపు వాదనలు జరిగాయి. సన్న, చిన్నకారు రైతులకు కావలసిన పనిముట్లను అందజేయాలని విజ్ఞప్తి చేశారు. పేద ప్రజలకు ఇళ్ల పట్టాలను ప్రజలు నివాస యోగ్యంగా లేని క్వారీల దగ్గర ఇచ్చారని అవి కాకుండా గ్రామానికి దగ్గరలో నివాసం ఉండేందుకు ఉపయోగపడే ఇళ్ల పట్టాలను ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి బాల శంకర్, జడ్పిటిసి వేల్పుల ప్రశాంతి, గ్రామ సర్పంచ్ సునీత, తాసిల్దార్ పి శంకర్ బాబు, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలి ఆత్మహత్య

- సోదరుడితో వివాదం..పోలీసులకూ ఫిర్యాదు - వైసీపీ నేతల వేధింపులపైనా ఆరోపణలు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): వికలాంగురాలి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం విజయవాడ భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఊర్మిళానగర్‌కు చెందిన ఈ.ప్రశాంతి(38)కు పెట్టినప్పుడి పొలియో ఉంది. పీజీ వరకు చదువుకొని ఇంట్లో ఉంటుంది. ఈనెల 4వతేదీన తన సొదరుడు నుండి డబ్బులు అడుతుంటే దాడి చేస్తున్నాడని భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే శనివారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఫ్యాను ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నేతల వేధింపులే: పోతిన మహేష్

వైసీపీ నేతలు వికలాంగురాలి ఉన్న ఆమె పెన్షన్ నిలిపివేశారని, అప్పటి నుండి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని జనసేన నాయకులు పోతిన మహేష్ ఆరోపించారు. ఆత్మహత్యకు వైసీపీ నేతల కారణం అన్నారు. పెన్షన్ తొలిగించి నాటి నుండి ఇప్పటి వరకు పోరాటం చేస్తుందని, అనేక దఫాలుగా స్పందన కార్యక్రమంలో కూడా పెన్షన్ కొనసాగించాలని కోరామని తెలియజేశారు. కానీ వైసీపీ నేతలు పెన్షన్ రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు.

తుదితశకు అంబేద్కర్ విగ్రహ నిర్మాణం

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలోని స్వరాజ్ మైదానంలో నిర్మాణం జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం, స్మృతి వనం పనులు తుదిదశకు చేరుకున్నాయని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కమిషనర్ శనివారం అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులు 95 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. సుమారు రూ.400 కోట్లుతో నిర్మించే అతిపెద్ద విగ్రహ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని 500 మందికి పైగా కూలీలు పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రం నుండే కాకుండా దేశ వ్యాప్తంగా లక్షాధిమంది పర్యాటకలు స్మృతి వనం చూసేందుకు వస్తారని వారికి అవసరమైన వసతులు కల్పిస్తున్నామన్నారు. అంబేద్కర్ జీవితంలోని ప్రతి సంఘటనలను ప్రదర్శించే విధంగా ఆధునిక ఏసి థియేటర్, మ్యూజియం, లైబ్రరీలను విగ్రహం చుట్టూ నీటి కొలనులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేపీసీ ప్రాజెక్టు డైరెక్టర్ పీ.వాసుదేవరరావు, కే.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్లో శాంతిస్థాపనకై కొవ్వొత్తులతో భారీ ర్యాలీ

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్లో జరుగుతున్న వరుస సంఘటనలు భారతావనికే కళంకమని, దోషులపై కఠినచర్యలు తీసుకోవాలని కృష్ణా, గోదావరి అధ్యక్ష ఖండం సియస్ఐ బిషప్ టి. జార్జి కోర్నెలియన్ డిమాండ్ చేశారు. మణిపూర్లో జరిగిన సంఘటనలను నిరసిస్తూ శనివారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ చర్చ్ ఆధ్వర్యంలో క్రైస్తవులు నగరంలో భారీ కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విజయవాడ కతోలిక పీఠం మోన్సిగ్నోర్ రెవ. ఫాదర్ మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ క్రైస్తవ మతం ఏ మతానికి కులానికి జాతులకు విరోధం కాదన్నారు. అమెరికాతోపాటు, అనేక యూరప్ దేశాలు క్రైస్తవులపై దమనకాండను తమ తమ పార్లమెంట్ సెన్టి సాక్షిగా తీవ్రంగా ఖండించిన మన భారత ప్రథమ పౌరురాలు రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ గిరిజన మహిళ అయ్యుండి మణిపూర్ క్రూర దాష్టకాన్ని ఖండించకపోవడం చాలా బాధకరమన్నారు. యూరప్ దేశాల పర్యటలో వున్న విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు ఒక సందేశం ద్వారా కొవ్వొత్తుల శాంతికి సంఘీభావం ప్రకటించారు. మరనాత విశ్వసమాజం చైర్మన్ రెవ. ఆలూరి విశ్వప్రసాద్, డాక్టర్ టి. రవికుమార్, సాల్వేషన్ ఆర్మీ మేజర్ రెవ. తూమాటి పాల్, తదితరులు ప్రసంగించి తీవ్రంగా ఖండించారు. అంతకు ముందు బిషప్ హాజరయ్య హైస్కూల్ నుండి ప్రారంభమైన భారీ కొవ్వొత్తుల శాంతి ర్యాలీ వందలాది మంది క్రైస్తవులు రెడ్ సర్కిల్, సి.పి. ఆఫీసు రోడ్డు, సెయింట్ పాల్స్ బసితిక సియస్ఐ చర్చి మీదుగా బందర్ రోడ్డు గుండా హాజరయ్య స్కూల్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో వికార్ జనరల్ ఫాదర్ యం. గాబ్రియేలు, సియస్ఐ పాస్టర్ ఐ. "రుణానిధి, ఫాదర్ కొలకాని మరియన్న, ఫాదర్ తోట సునీల్ రాజు, ఫాదర్ యేలేటి విలియం జయరాజు, పాస్టర్ జయకుమార్ తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రాష్ట్ర దుర్మార్గంపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : రాష్ట్రంలో నెలకొన్న దుర్మార్గ పరిస్థితులపై కేంద్రం జోక్యం చేసుకోవాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌రావు పేర్కొన్నారు. పుంగనూరులో టీడీపీ నాయకులపై జరిగిన రాళ్ళదాడి సంఘటనను నిరసిస్తూ స్థానిక పటమట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బయటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పుంగనూరులో ఏర్పాటు చేసిన మీటింగ్‌లో వైసీపీ గూండాలు రాళ్ళదాడికి పాల్పడటంపై కేంద్రం స్పందించాలన్నారు. చంద్రబాబు బద్రతపై కేంద్ర మంత్రి వర్గం ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్చించాలన్నారు. టీడీపీ సభలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు గలాటా టీడీపీ నాయకులుపై కేసులు నమోదు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు సభలో వైసీపీ నాయకులు, గూండాలు దాడులు చేసి టీడీపీ జెండాలు చింపివేసి పోలీసులపై కూడా రాళ్ళు రువ్వారన్నారు. అధికారులు కూడా రాజకీయ నాయకులుగా వ్యవహరించటం సరికాదన్నారు. ఇలాంటి దుర్మార్గ పరిణామాల వల్ల రాష్ట్రం రోజు రోజుకూ అణగారిపోతోందని, రాష్ట్రంలోని యువత చెడు మార్గాన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఆయా సంఘటనలపై కేంద్రం కలుగజేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, కార్పొరేటర్‌లు, చెన్నుపాటి ఉషారాణి, ఎం.ప్రసాద్, పీ.సాయిబాబు, జే.సాంబశివరావు, నాయకులు రాయి రంగమ్మ, నిర్మల, షకీలా, రత్నశ్రీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రజాపరిషత్ కార్యాలయము - చందర్లపాడు

ఆర్.సి.నెం.13/2023/ఎ తేది:-04-08-2023.

యన్.టి.ఆర్ జిల్లా చందర్లపాడు మండలము పరిధిలోని పోక్కునూరు - కోగంటివారి పాలెం ఫెర్రీ నందు 2023-2024సం.నకు **(డి.01-08-2023 నుండి డి.31-07-2024** వరకు కృష్ణా నదిపై పడవలు త్రిప్పి సుంకం వసూలు చేయుటకు గాను **డి.09-08-2023 వ తేదీ బుధవారము మధ్యాహ్నం 02.00** గంటలకు మండల పరిషత్ కార్యాలయము, చందర్లపాడు నందు బహిరంగ వేలం నిర్వహించబడును.

కె. జ్యోతి
మండల పరిషత్ అభివృద్ధి అధికారి,
మండల ప్రజా పరిషత్, చందర్లపాడు